
క్లుప్తంగా

నేటి నుంచి రమణాచారి జన్మదినోత్సవం

చిక్కడపల్లి: త్యాగారాయగానసభ ఆధ్వర్యంలో ఈ నెల 9 వ తేదీ గురువారం నుంచి 15 వరకు ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి జన్మదినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రమణాచారి 71వ జన్మదిన వేడుకల సందర్భంగా జరిగే సప్తాహంలో భాగంగా 9న మల్లాది ఉష ఆధ్వర్యంలో త్యాగరాయ కీర్తనల గానం ఉంటుందన్నారు.

వార్షికోత్సవానికి శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమం ముస్తాబు



నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలో గల శ్రీ కుసుమహరనాథ ఆశ్రమం వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 12 తేదీలలో రెండు రోజుల పాటు ఈ వేడుకలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆశ్రమ నిర్వాహకులు కోరారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మవెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్‌లో పెండ్డింగ్ పనులను సకాలంలో పూర్తిచేయాలని డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అధికారులను సూచించారు. బుధవారం సీఈ కాలనీ పార్కులో వివిధ విభాగాల అధికారులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా బస్తీల్లో పేరుకుపోయిన మట్టికుప్పలు, వీధిలైట్లు, కలుషిత మంచినీటి సరఫరా వంటి సమస్యలు ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు, స్పీడ్‌బ్రేకర్ల ప్రతిపాదనలను పూర్తి చేయాలన్నారు.

కార్మికుల సంక్షేమ పాలక మండలిని నియమించాలి

చిక్కడపల్లి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పాలకమండలిని నియమించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్‌చేశారు. ఆధ్వర్యంలో ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని రాష్ట్ర కార్మిక కమిషనర్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు.మూడేళ్లుగా అనేక కేసులు పరిహారం కాక పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. తక్షణమే క్లయిములు పరిష్కరించి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షులు ఉజ్జినిరత్నాకర్ రావు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుల్తాన్‌బజార్: యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని, రెండవ విడత గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా బ్యాంక్ అకౌంట్లో నగదు జమ చేయాలని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారమోని శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు కుమార్‌చౌదరి వారిని పరామర్శించారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రగతి భవనంపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు తుంగబాలు పేర్కొన్నారు. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అభివృద్ధిని చూసి ఇక కాంగ్రెస్‌కు రాజకీయ భవిష్యత్ ఉండదనే అక్కస్సుతో నక్సలైట్ల పేరును వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నక్సలైట్ల విమర్శలకు సైతం తావులేకుండా అభివృద్ధి, శాంతియుతమైన పాలనను చూసి ఓర్వలేక ప్రగతి భవనాన్ని పేల్చి వేయాలని రేవంత్‌రెడ్డి తీవ్రవాదిగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు.

నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా నిలుపుతాం

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



బర్కత్‌పురలో మంచినీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కాచిగూడ: నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా నిలపడమే ధ్యేయంగా పని చేస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బర్కత్‌పురలో రూ.6లక్షల వ్యయంతో నూతనంగా చేపడుతున్న మంచినీటి పైపులైన్ నిర్మాణపు పనులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగుతున్నాయని అన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలపై ఆయన చర్చించారు. తాగునీరు, రోడ్లు, పార్కులు, మౌలిక వసతులు కల్పించడంలో రాజీ పడేది లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి కాచిగూడ డివిజన్ పరిధిలోని బర్కత్‌పుర, లింగంపల్లి, శాలిని హాస్పటల్ లేన్ తదితర ప్రాంతాల్లోప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. పనిచేయని హ్యాండ్, పవర్ బోర్లకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి

అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అపార్టుమెంట్‌లలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. ప్రజా సమస్యల పట్ల స్పందించినప్పుడే ప్రజల్లో గౌరవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు దిడ్డి రాంబాబు, ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల ఓంప్రకాష్ యాదవ్, డాక్టర్ బి.శిరీష యాదవ్, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, అధికారులు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం కవాడిగూడ డివిజన్ భాగ్యలక్ష్మి నగర్‌లో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా మంచినీటి, డ్రైనేజీ పైపులైన్‌లు ఆధునీకరించిన తరువాతే సీసీ, వీడీసీ రోడ్లు నిర్మిస్తూ కనీస సౌకర్యాలు కల్పించేందుకు యుద్ధప్రాతిదికన చర్యలు తీసుకుంటున్న ట్లు ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ యువజన విభా గం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా కవాడిగూడ అధికారులు ప్రొటోకాల్‌ను పాటించడం లేదని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ ఆరోపించారు. బుధవారం కవాడిగూడ భాగ్యలక్ష్మినగర్‌లో జరిగిన రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సన్నీ సిబ్బందిపై ఎమ్మెల్యే ముఠాగోపాల్ సమక్షంలోనే ఆగ్రహం వ్యక్తం చేశారు.

రమణాచారికి పలువురి జన్మదిన శుభాకాంక్షలు

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్‌ఎస్) ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంటలో తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుడు డాక్టర్ కేవీ రమణా చారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు, ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగా రావు తదితరులు రమణా చారిని కలిసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సునీల్ పాల్గొన్నారు.

రోడ్లపై పార్కింగ్ చేస్తే ప్రయాణించడం ఎలా..?

ముషీరాబాద్: ప్రధాన రహదారులపైనే అక్రమంగా పార్కింగ్ చేస్తుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కృష్ణానగర్ అధ్యక్షులు వై.శాంతికుమార్ వెల్లడించారు. బుధవారం కృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్ కృష్ణానగర్‌లో అక్రమ పార్కింగ్ రోజు రోజుకు పెరిగిపోతుందన్నారు. ఎస్‌ఆర్‌టీ పార్కు ప్రాంతంలో కార్లు, ద్విచక్ర వాహనాలను పూర్తిగా పార్కింగ్ చేసి నింపి వేస్తున్నారన్నారు. ఎవరికి పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ప్రధాన రహదారులపైనే పార్కు చేస్తున్నారన్నారు. కృష్ణానగర్‌లోకి అంబులెన్స్, ఆటో, లారీలు రాకుండా పార్కింగ్ చేపడుతున్నారన్నారు. దీంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు ఈ విషయమై స్పందించి అక్రమంగా పార్కు చేసిన వాహనాలను తరలించాలని కోరారు.

ఉచిత వ్యాధి నిరోధక టీకా కేంద్రం ప్రారంభం



టీకా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో కాచిగూడలోని మున్నూరు కాపు భవన్‌లో నిర్వహిస్తున్న మెడికల్ హెల్త్ సెంటర్‌లో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత వ్యాధి నిరోధక టికా సెంటర్‌ను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు సమయాను సారంగా వ్యాక్సిన్, టీకాలు ఎప్పటికప్పుడు వేయించి పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యుపిహెచ్‌సీ, ఆర్‌ఎఫ్‌పిటీసీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీకా సెంటర్‌లో ప్రతి బుధవారం పిల్లలకు అన్ని రకాల వ్యాక్సిన్, టీకాలు ఉచితంగా ఇస్తామన్నారు.కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు, ఆకుల పాండురంగారావు, దదువై రాఘవేందర్ రావు పాల్గొన్నారు.

ఎక్స్‌క్యూజ్‌మీ చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నవ్వడి క్రిష్ సమర్పణలో శ్రీ కనకదుర్గ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన హీరో, హీరోయిన్‌లను పరిచయం చేస్తూ రూపొందిస్తున్న ఎక్స్‌క్యూజ్‌మీ చిత్రం పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. పలు చిత్రాలకు నృత్య దర్శకుడిగా పని చేసిన గోల్కొండ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో హీరోగా కిషోర్, హీరోయిన్‌గా దేవిప్రియ నటిస్తున్నారు. ఈ చిత్రం పోస్టర్‌ను హనుమాన్ వ్యాయామ శాల సెక్రటరీ మైథిలి శరణ్ లాంచ్ చేశారు.

వైఎస్ షర్మిలకు ముషీరాబాద్ నేతల సంఘీభావం



వైఎస్ షర్మిలను సన్మానిస్తున్న ఆకుల ప్రవీణ్, రవళి తదితరులు

కవాడిగూడ: వైఎస్‌ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల తెలంగాణ ప్రజాప్రస్థానంలో భాగంగా చేపడుతున్న పాదయాత్ర 3600 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ ముషీరాబాద్ కోఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు మునిరామ్ నాయకుడు, కవాడిగూడ డివిజన్ అధ్యక్షురాలు ఆకుల రవళిలు వైఎస్ షర్మిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ప్రారంభమైన మలివిడత వైఎస్‌ఆర్‌టీపీ ప్రజాప్రస్థానంలో భాగంగా 229వ రోజు హన్మకొండ, జనగామ, జిల్లాల్లో భాగంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం జఫర్‌గడ్ మండలం గర్నేపల్లి గ్రామంలో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపి ఆమె పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

సుల్తాన్‌బజార్: ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల వల్ల చేతి వృత్తులు కోల్పోయిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. చేతివృత్తి పనులు మరుగున పడడంతో విశ్వకర్మలకు చేతి నిండా పని లేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయడంతో పాటు ప్రత్యేకంగా రూ.500 కోట్లు కేటాయించి వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుల వృత్తిదారులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని కోరారు. విశ్వబ్రాహ్మణుల ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం ఉప్పల్ భగాయత్‌లో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించగా ఇటీవల భూమి పూజ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు రవీంద్రాచారి, శశిధర్ శిల్పి, వీరాచారి, శ్రీనివాస చార్యులు, కిషన్, వెంకటస్వామి, సుదర్శనాచారి, వీణవంక సదానందం తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత అభివృద్ధికి బాటలు వేసిన రాష్ట్ర బడ్జెట్



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ తయారీ ప్రక్రియ, కేటాయింపుల్లో ప్రాధామ్యాలను నిర్దేశించుకొని సమ్మిళిత అభివృద్ధికి బాటలు వేసిందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ – ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు' అనే అంశంపై బుధవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమాస్వామి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అనంతరం వకుళాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ బడ్జెట్ రూపకల్పనలో అన్ని నిర్ణయాలకు తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సంక్షేమాలే గీటురాయిగా స్వీకరించిందన్నారు. అస్ఫూర్తితోనే ప్రభుత్వం మూడు ప్రాధామ్యాలను గుర్తించి ఆచరణలోకి తేల్చిందన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



ధీరజ్ రెడ్డి(ఫైల్)

నల్లకుంట: కాలేజీకి వెళుతున్నానని చెప్పి వెళ్లిన ఓ ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.సీఐ మొగిలిచర్ల రవి తెలిపిన మేరకు.. కీసర నాగారానికి చెందిన సామ వెంకట్ రెడ్డి కుమారుడు ఎస్. ధీరజ్ రెడ్డి(16) నల్లకుంట నానో జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 3న బంధువుల వివాహ వేడుకలకు హాజరయ్యేందుకై ధీరజ్ ఇంటికి వెళ్లాడు. తిరిగి 6వ తేది ఉదయం ఊబర్ బైక్‌పై కళాశాలకు వచ్చాడు. మధ్యాహ్నం ధీరజ్ కాలేజీకి రాలేదని కళాశాల నుండి తండ్రి ఫోన్‌కు మెస్సెజ్ వచ్చింది. బుధవారం ఉదయం కళాశాల వద్దకు వచ్చిన తండ్రి కళాశాల సీసీ కెమెరా ఫుటేజ్ చూడగా 6వ తేదిన ఉదయం ధీరజ్ కళాశాల ముందు బైక్ దిగినట్లు ఉంది. ఆందోళన చెందిన వెంకట్ రెడ్డి తమ కుమారుడు కనిపించడం లేదంటూ నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వి పోశారు, నిర్మాణం మరిచారు



సీసీ రోడ్డు నిర్మాణం కోసం పాత నల్లకుంట డాక్టర్ చేరీలేన్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

నల్లకుంట: అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణా లోపం ప్రజలపాలిట శాపంగా మారుతోంది. అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్లు ఆయా ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు వారాల క్రితం పాత నల్లకుంట డాక్టర్ చేరీలేన్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టర్ రోడ్డును తవ్విపోయించారు. రోజులు గడుస్తున్నప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదు. తవ్వి పోసిన రోడ్డుతో ఈ వీధిలో నడవడానికి కూడా వీలులేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు గాయాల పాలవుతున్నారంటున్నారు. పైగా ఈ వీధిలో తవ్వి పోసిన మట్టి డ్రైనేజీ మ్యాన్ హోళ్లలోకి చేరితే డ్రైనేజీ సమస్యలు తలెత్తే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై సదరు కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే రెడీ మిక్స్ వాహనం అందుబాటులోలేదని చెబుతున్నారని స్థానికులు అంటున్నారు. ఒకే కాంట్రాక్టర్‌కు అభివృద్ధి పనులన్నింటినీ అప్పగించడం కారణంగా పనుల్లో జాప్యం జరుగుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని సీసీ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించేలా సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు వ్యతిరేక విధానాలు చేపడుతున్న కేసీఆర్



రైతు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులను అరెస్టు చేసిన దృశ్యం

కవాడిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నారని గొప్పలు చెప్పుకుంటూ ఆచరణలో మాత్రం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రైతులను నష్టపరుస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు ఆరోపించారు. బుధవారం రైతులు చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా సహాయం చేయని కేసిఆర్ ఇతర రాష్ట్రాలకు వెళ్లి రైతులకు ఏమి వరగపెడుతున్నాడని ధ్వజమెత్తారు. బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి రాజేందర్, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయండి



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. గత 20 ఏళ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్న వీరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేస్తూ బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాకు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుల పద్మశ్రీ అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీతభత్యాలు అంతంత మాత్రమే కావడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా తయారైందదని వాపోయారు. ఫెడరేషన్ అధ్యక్షులు జయ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జై కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్తాం



ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: ప్రజలకు నీతివంతమైన పాలన అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. మోదీ, కేసీఆర్‌ల వైఫల్యాలను అవినీతి బాగోతాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేస్తామని ఆయన తెలిపారు. బుధవారం కావడిగూడ లోయర్‌ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మమ దేవాలయంలో పూజలు నిర్వహించి అంబేద్కర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు సంఘీభావంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ కాలనీ, రోజ్ కాలనీ, గగన్ మహాల్‌లో ఇంటింటికి వెళ్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరించడంతో పాటు తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి అండగా నిలవాలని కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు వివరించారు.

బీజేపీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం



బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్ రాజ్‌కు పార్టీ డైరీని అందజేస్తున్న అప్సర్ పాషా

నల్లకుంట: బీజేపీ ద్వారానే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్ పాష అన్నారు. బీజేపీ పటిష్టం చేసేందుకు అన్ని మైనార్టీ శక్తి కేంద్రాలలో మైనార్టీ మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీజేపీ నూతన సంవత్సరం డైరీని ఆవిష్కరించిన అప్సర్ పాష మాట్లాడారు. హైదరాబాద్ పాత బస్తీలో ఏ మేరకు అభివృద్ధి చేశారో పాత బస్తీకి ప్రతినిధ్యం వహిస్తున్న ఎంఐఎం నేతలు శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చిత్త శుద్ధి ఉంటే రాబోయే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని ఎంఐఎం నేతలు అసదుద్దీన్ సోదరులకు సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్‌లోని ముస్లిం ఎమ్మెల్యేలు మైనార్టీ వర్గాలకు ద్రోహం చేశారని ఆరోపించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని జెమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం టెన్త్ విద్యార్థులకు దాతలు ఎం.డి.జహంగీర్, లింగంయాదవ్‌లు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుస్తకాలను విద్యార్థులకు పంపిణీచేశారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభం.

పద్మాకాలనీలో రూ.7.50 లక్షల వ్యయంతో నూతనంగా నినర్మించే డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జలమండలి అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శర్మ డిమాండ్ చేశారు. లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను రైల్వే బోర్డు పరిష్కరించాలని బుధవారం సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న లోకో రన్నింగ్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జోన్‌లో ప్రస్తుతం 327 ఖాళీలు ఉన్నాయని ప్రమోషన్లు ఆమోదించడంలో కూడా విపరీతమైన జాప్యం జరుగుతుందని ఆరోపించారు. 46 గంటల వారాంతపు విశ్రాంతిని అమలు చేసి, వరుస రాత్రి డ్యూటీలను రెండు రోజులకు పరిమితం చేయాలని కోరారు. అడ్‌హక్ ప్రమోషన్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.